చెహోవ్ కథలు

# కీర్తి



రైల్లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తున్న ఓ పెద్దమనిషి డిన్నర్ ముగించి, బెర్త్ మీద వాలి, త్రేన్చి, బొజ్జ నిమురుకుంటూ, ఎదురుగా కూర్చున్న మరో ప్రయాణీకుడితో కబుర్లలోకి దిగాడు.

"ఏమిటోనండి, కొన్ని అలవాట్లు వంశపారంపర్యంగా వస్తాయేమోననిపిస్తుంది. మా నాన్నా ఇంతే. సుష్టుగా భోంచేస్తామా, ఎవర్తోనైనా మంచి కబుర్లు చెప్పాలనిస్తుంది. ఏమంటారు, మీకు అంతేనా?"

జవాబు లేకపోవడంతో, "పోనీ, నేను మాట్లాడితే మీకు అభ్యంతరం లేదనుకుంటాను"

"మాట్లాడండి, వింటాను"

"గుడ్. ఇప్పటిదాకా ప్లాట్‌ఫాం మీద ఇద్దరు యువకులు మాట్లాడుకోవడం విన్నారా. వాళ్లలో ఒకడు అంటున్నాడూ, 'కంగ్రాట్స్, నువ్వప్పుడే సెలెబ్రిటీవైపోయావు. నీ నెత్తికి కీర్తి కిరీటం వచ్చేసిందిరోయ్' అని. వాళ్లు బహుశా, కొత్తగా రంగ ప్రవేశం చేసిన నటులో, కుర్రకారు పత్రికావిలేఖర్లో అయ్యుంటారు. సర్లెండి. వాళ్లెవరైతే మనకేమిటి గాని, అసలు విషయం 'సెలెబ్రిటీ, కీర్తి' అంటే ఏమిటి? వాటినెలా అర్థం చేసుకోవాలి? పుష్కిన్ కీర్తికిచ్చిన నిర్వచనం తెలుసుగా. చిరుగుపాతల్లో రంగుగుడ్డ, పుష్కిన్, బాగానే చెప్పాడనుకోండి, కాని మీ నిర్వచనమేమిటో గూడా చెప్పండి"

"మళ్లీ మనం కొత్తగా నిర్వచించాల్సిన అవసరమేమిటి?"

"ఎందుకంటే, అదేమిటో తెలిస్తే, దాన్నెలా సంపాదించుకోవాలో కూడా అర్థమౌతుంది. గురువుగారూ, ఒక్కమాట వినండి. చిన్నతనంలో నాకూ కీర్తి కండూతి వుండేది. నిద్రాహారాలు మాని కీర్తి కోసం, పేరు కోసం కృషి చేశాను. నా ఆరోగ్యాన్ని కూడా లెక్క చెయ్యలేదు. ఖ్యాతి రావటానికి అవసరమైన అర్హతలన్నీ నాకుండేవి. ఇంతకూ నా గురించి చెప్పలేదు కదూ. ఆ రోజుల్లో నేను బాగా పేరున్న ఇంజనీర్ని. దేశం నలుమూలలా డజన్లకొద్దీ వంతెనలు నిర్మించాను. పెద్ద పెద్ద వంతెనలు, సాంకేతిక నైపుణ్యానికి సవాలు విసిరే వంతెనలు. మూడు నగరాల్లో వాటర్ వర్క్స్ సిస్టం నేనే రూపొందించాను. ఈ దేశంలోనే కాక, ఇంగ్లండులో, బెల్జియంలో కూడా పనిచేశాను. ఇంతేనా అంటారా! నాకు కెమిస్ట్రీలో కూడా అభినివేశం ఉంది. ఎన్నో పరిశోధనలు, ప్రయోగాలు చేసి కెమికల్ సైన్స్‌లో ఎన్నో కొత్త విషయాలు కనుక్కొన్నాను. ఎప్పుడైనా చూడండి. అనేక విదేశీ కెమిస్ట్రీ టెక్స్‌బుక్స్ మీద నా పేరుంటుంది. అంతే కాదు. ప్రభుత్వంలో పాలనాదక్షుడిగా నాకు మంచి పేరుంది. ఎన్ని వున్నతోద్యోగాలు చేశానో. పార్లమెంటుకు నామినేట్ చేశారు నన్ను. ఒక్క నలుపు మరకలేని శుభ్రమైన, బ్రిలియెంట్ రికార్డ్ నాది. సారీ, మీకు బోరు కొడుతున్నానా. క్షమించండి. ఇదంతా ఎందుకు చెప్పానంటే, ఈ సోకాల్డ్ సెలెబ్రిటీస్‌కు వుండే పేరు ప్రఖ్యాతులకన్నా నాకు చాలా ఎక్కువ అర్హతలున్నాయని చెప్పటానికి. ఏం సాధిస్తేనేం. చూస్తూ, చూస్తూ ముసలాణ్ణైపోయాను. ఇంక యిప్పుడో, అప్పుడో చిలక ఎగిరిపోతుంది. అయినా ఏం మిగిలింది? ఇప్పుడు నా పేరెవరికి తెలుసు. అదిగో, ఆ స్తంభం పక్కన నిల్చున్న కుక్కకెంత కీర్తి వుందో అంత వుంది నాకు."

"ఛ. అలా ఎందుకు ఆత్మనింద చేసుకుంటారు. మీరు నిజంగానే కీర్తిమాన్యులు."


"ఒకే సార్! నేను చాలా ఫేమస్ అన్నారు. మీరే మీ నోటితోనే. ఎప్పుడైనా మీరు క్రికునోవ్ పేరు విన్నారా?"

"లేదే"

"అది. ఆ క్రికునోవ్‌ని నేనే. మీవంటి సంస్కారవంతులు, విద్యాసంపన్నులు మీరే నాపేరు వినలేదంటే నాకు కీర్తి ప్రతిష్టలు లేనట్టే కదా. నిజానికి తప్పునాదే! ఎంతసేపూ జ్ఞానం పెంచుకోవటానికీ, అర్హతలు పెంచుకోవటానికీ ప్రయత్నించానే తప్ప కీర్తికోసం పాకులాడలేదు. అదే నేను చేసి పొరపాటు."

"పోనీ, కీర్తి కోసం ఎలా ప్రయత్నించాలో చెప్పండి"

"నాబొంద. ఆ రహస్యం తెలిస్తే యిలా ఎందుకుండేవాణ్ని. ప్రతిభ, జీనియస్, విలక్షణత. ఇవన్నీ వేస్ట్ మైడియర్ సార్. ఎందుకూ పనికిరాని అడ్డగాడిదలు, గుడ్‌ఫర్ నథింగ్ ఫెల్లోస్, నేను సాధించిన ఘన కార్యాల్లో వెయ్యోవంతు పనికూడా చెయ్యని వెధవలు కీర్తి శిఖరాలు మాత్రం ఎక్కి కూర్చున్నారు. పూలదండలు వేయించుకుంటున్నారు. చప్పట్లు కొట్టించుకుంటున్నారు. బిరుదులు, సన్మానాలు అందుకుంటున్నారు. చూడండి, ఏ పేపర్లో చూసినా ఈ వెధవల పేర్లే, తాటికాయంత అక్షరాల్తో. క్షమించండి. మిమ్మల్ని విసిగించడం నా వుద్దేశం కాదు గాని, ఓ చిన్న కథ వినండి."



"కొన్నేళ్ల క్రితం ఓ బ్రిడ్జి కట్టే సందర్భంలో ఓ చిన్న వూళ్లో వుండాల్సివచ్చింది. మనలాంటి వాళ్లకు ఆ వూళ్లో ఏం టైంపాస్ అవుతుంది చెప్పండి. మనమధ్యన రహస్యాలెందుకు. వ్యవహారాలనండి. వినోదాలనండి. రెండే రెండు ఉండేవితలు. ఒకటి పేకాట. మరొకటి అదే ఫిమేల్ సెక్స్. ఆ వూళ్లో నాటకాల్లో పనిచేసే ఓ యువతి వుండేది. ఆమెతో స్నేహం కుదిరింది. ఏదో కాలక్షేపం మరి. అదేమిటో ఆవిడ్ని చూస్తే జనం వెర్రెత్తిపోయేవాళ్లు. ఆమె స్టేజిమీద కనిపిస్తే చాలు చప్పట్లు, ఈలలు. ఆమె ప్రతి మాటకూ, పాటకూ వన్స్‌మోర్లే. సరే ఈ లోకల్ నటీమణుల బుద్ధికౌశల్యం గురించి మీకు తెలియందేముంది. ఆ బుర్రలో మెదడుంటుందో మరేముంటుందో అర్థం కాదు. ఎంతసేపూ తిండీ, షోకులూ, పనికిరాని కబుర్లూ, వెకిలినవ్వులూ, ఆమెనేమని పిలుద్దాం? వసంతసేన అందామా? మధురవాణి అందామా? సరే. నాట్య వృత్తి అది. మనమెందుకూ తప్పుపట్టడం. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఆ రోజుల్లో నాక్కాస్త నాటకాల పిచ్చి వుండేది. అయితే అందరూ ఈవిణ్ని 'నటీమణి, మయూరి' అంటూ ఆకాశానికెత్తేస్తుంటే మాత్రం చిర్రెత్తుకొచ్చేది. ఒళ్లు మరిచిపోతుంటూ, చెమ్కీలు పొయ్యే ఈ ఆడదానే మనిషి నటీమణా? నడకచూస్తే బాతు నడక. గొంతుచూస్తే గులకరాళ్లు డబ్బాల్లో వేసి చప్పుడు చేసినట్టుగా. మరెందుకు ఆమె అంత పాపులర్ అయింది? ఆ రహస్యం మీకు మాత్రం తెలియదా ఏమిటి? నడుస్తూ నడుస్తూ సడెన్‌గా కొంగు జార్చుకుంటారు. లేదా ఏదో మిషతో చీర మోకాలిదాకా లేపుతారు. అది చాలదూ, జనానికి పిచ్చెక్కించటానికి. అదీ ఆవిడ కళా వైదుష్యం. ఇదికాక, ఒంటికి బిగుతైన దుస్తులు, ఒంపులన్నీ స్పష్టంగా కనిపించటానికి. సరే. ముఖ్యమైన విషయం ఒకటి చెబుతాను వినండి.

వంతెన ప్రారంభోత్సవం రోజు రానే వచ్చింది. సన్మానాలూ, ఉపన్యాసాలూ, పూల దండలూ, పొగడ్తలూ, ఇవన్నీ మామూలేకద. కాని నాకు యివి ముఖ్యం కావు. నా తెలివితేటలతో, నా శాస్త్ర పరిజ్ఞానంతో నిర్మించిన నా బేబీ నా బ్రిడ్జి. అదీ నాకు ప్రాణం. ఆ రోజులో ఆ బ్రిడ్జిని సాంకేతిక నైపుణ్యానికి వరాకాష్ఠగా చెప్పుకున్నారు. చూడటానికి దూరప్రదేశాలనుండీ జనం విరగబడి వచ్చారు. నాకు తెలుసు. జనం కళ్లన్నీ నామీద వుంటాయని. అద్భుత శాస్త్ర సాంకేతిక ప్రగతికి సంకేతం. ఆ వంతెనకు రూపకల్పన చేసి దగ్గరవుండి కట్టించిన గొప్ప ఇంజనీరు, అంతమంది నన్ను చూడటానికి వచ్చారంటే ఎంత యిబ్బందిగా వుంటుందో, దూరంగా ఎక్కడికైనా వెళ్లి దాక్కోవాలని పించింది.

కాని నేనంత వర్రీ కావలసిన పని లేదు. త్వరలోనే తెలిసింది. అక్కడ పనిచేసే సహోద్యోగులకు తప్ప ఎవరికీ నేనక్కడ వున్నట్టే తెలియదు. అన్నివేల మంది మూర్ఖులు ఆ బ్రిడ్జిని చూసి ఆశ్చర్యంతో, విభ్రమంతో అవాక్కయ్యారే గాని ఒక్కడికీ ఆ

**రష్యన్ మూలం: చెహోవ్**

**తెలుగు గొంతు: కరుణారుణ**

బ్రిడ్జి రూపకర్తను చూడాలనే కోరిక కలగలేదు. అప్పట్నించీ నాకీ ప్రజలంటే అసహ్యం ఏర్పడింది. సరే. అదలా వుంచండి. ఆ హడావిడిలో జనంలో గుసగుసలు మొదలయ్యాయి. సడెన్‌గా ఆ మొహాల మీద చిన్నవ్వులు. అందరూ నావేపే చూస్తున్నా రనుకున్నాను. వాళ్ల కంత సంస్కారంకూడానా! ఆ దరహాసాలు నాకోసం కాదు. ఆ గాడిద అంతా మెడలు నిక్కబొడుచుకుని చూసింది ఆమె కోసం. 'అబ్బో. బ్యూటీ ఛార్మింగ్. అదిగో, ఆ పక్కన నిల్చున్నవాడే ఆమె లవర్."

జిజ్ఞాసువులా కనిపించిన ఓ యువకుణ్ణి "ఈ బ్రిడ్జి ఎవరు కట్టించారో తెలుసా?" అని అడిగాను.

"ఎవడో యింజనీరు కట్టుంటాడు లెండి" అదీ సమాధానం.

"మీ వూర్లో గంటస్తంభం ఎవరు కట్టారో తెలుసా?"

"మాకెలా తెలుస్తాయండీ యిలాంటి అనవసర విషయాలూ"

"పోనీ, ఈ ప్రాంతంలో బెస్ట్ ఆర్కిటెక్ట్ ఎవరో, బెస్ట్ టీచర్ ఎవరో, బెస్ట్...తెలుసా?

అన్నింటికీ ఒకటే సమాధానం. 'తెలియదు'.

"ఈ 'నటీమణి' ప్రస్తుత ప్రేమికుడెవరో, అదైనా తెలుసా?"

"ఆ. ఎవడో క్రికునోవ్ అని యింజనీ రున్నాట్ట"

"ఏం సార్. ఆ జవాబువింటే ఎలా వుంటుంది మీకు, చెప్పండి. అయ్యా, ఈ రోజుల్లో వీరగాథలు చెప్పటానికి జానపద కళాకారులెవరూ మిగల్లేదు. ఇప్పుడు మనిషికి కీర్తిని సంపాదించి పెట్టేవి పత్రికలు, ప్రెస్. ఆ తెల్లారి లోకల్ పత్రికలో ప్రారంభోత్సవానికి సంబంధించిన వార్త వస్తుందేమోనని వెదికాను. హుఁ. ఏమి వార్త. పేపర్లో, చివరి పేజీలో ఆఖరికాలంలో యిలా రాశారు.

నిన్న బ్రిడ్జి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గవర్నరుగారూ ఇతర పుర ప్రముఖులూ విచ్చేశారు. స్థానికులు అనేక మంది వుత్సాహంగా పాల్గొన్నారు. ఆ సభలో అందాలరాశి, మన ప్రముఖ నటీమణి దర్శనంతో జనం వెర్రెత్తిపోయారు. తను వేసుకున్న సరికొత్త డిజైను డ్రెస్, కేశాలం కరణ అందరికీ కనువిందు చేసింది. ఇంక ఆమె మేకప్ గురించి చెప్పాలంటే...అయ్యా అదీ వార్త. అంతేకాని నాగురించి ఒక్కటంటే ఒక్కమాట లేదు. నాకు కీర్తికాంక్ష లేశమయినా లేకపోయినప్పటికీ ఆ వార్త చదివింతర్వాత కన్నీరాగలేదు.

ఆ చిన్న వూళ్లో వుండే చిన్న వార్తా పత్రికల కథనాల గురించి నాలాంటివాడు బాధపడట మేమిటని సమాధానపరచుకున్నాను. రాష్ట్ర, దేశ రాజధానుల్లో వుంటే కీర్తి వస్తుంది గాని, పల్లెటూర్లలో వుంటే వస్తుందా! సెయింట్ పీటర్స్ బర్గ్‌లో ఓ సైన్సు కాంపిటేషన్ జరుగు తుంటే అందులో పాల్గొన్నాను. అక్కడ ప్రముఖ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, మేధావుల మధ్య నాకు తప్ప గుర్తింపు వస్తుంది.

వెంటనే 'నటీమణి'ని వెంటపెట్టుకుని సెయింట్ పీటర్స్ బర్గ్‌కు ప్రయాణమయ్యాను. అనుకున్నట్టుగానే అక్కడ నాకు గుర్తింపు వచ్చింది. విజయోత్సవంలో షాంపేను తాగాను. తెల్లారి ఆ నగరంలో పత్రికలన్నీ కొనుక్కొచ్చాను. మన గురించిన పొగడ్తలు చదువుకోవాలంటే యిబ్బందిగానే వుంటుంది. అందుకని కాస్త అయిష్టంగానే పేపర్లు

తిరగేశాను. మొదటి పేపర్లో అసలు నా గురించిన వార్తనే ప్రచురించలేదు. రెండోపేపరూ, మూడోదీ అంతే. నాలుగో పేపర్లో వార్త చదివి నా కళ్లను నేనే నమ్మలేకపోయాను... మొన్నరాత్రి ఫలాని వూరినుంచి ప్రముఖ నటీమణి ఫలాన రైల్లో ఈ వూరికి చేరింది. ఆమె రాకతో నగరానికే పండగవాతావరణం వచ్చింది. యువకులు ఉషారుగా ఆమె వుంటున్న హోటల్ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు...' ఇలా ఇంకేం రాశారో తెలియదు గాని, ఆ కింద చిన్న అచ్చులో, 'నిన్నటి పోటీలో ఫలాని ఇంజనీరుకు ప్రథమ బహుమతి వచ్చింది' అంటూ ఓ వాక్యం రాశారు. ఎంత అవమానం. నా పేరు కూడా వాళ్లకు తెలియదు. క్రికునోవ్ బదులు కిర్కునోవ్ అంటూ రాశారు. ఆ నగరానికున్న మేధాగరిమ అలాంటిది. నెలరోజుల తర్వాత నేను తిరిగివెళ్లిపోతుంటే ప్రముఖ నర్తకికి వీడ్కోలు గురించే గాని నా గురించి కాదు వార్త.

మళ్లీ కొన్నేళ్లకు నేను అక్కడి మేయర్‌గారి ఆహ్వానంపై మాస్కో వెళ్లాను. ఇంజనీరింగ్ సమస్య ఏదో వచ్చింది. అది నేను తప్ప మరెవరూ పరిష్కరించలేరు. అక్కడి యువశాస్త్రజ్ఞులకు సహాయంగా వుంటుందని నేను నా పరిశోధనల గురించి కొన్ని ఉపన్యాసాలిచ్చాను. ఆ ఉపన్యాసాలకు వచ్చిన డబ్బంతా దానం చేశాను. ఇంత చేసినా నా గురించి పేపర్లు రాశాయా? లేదు. అగ్నిప్రమాదాలు, నాటకాలు, వినోదాలు, మోసాలు, హత్యలు, రాజకీయాలు, ఉద్యోగుల పోస్టింగులు, తాగుబోతుల, జూదరుల అకృత్యాలు ఇవీ పత్రికల్లో వార్తలు. ఇదీ ఈ దేశరాజధాని సాంస్కృతిక, శాస్త్ర పరిణితి. ఛీ.

ఒకరోజు నేను బండిలో ప్రయాణం చేస్తున్నాను. బండినిండా జనం కిక్కిరిసి వున్నారు. ఎవరో యిద్దరు మాట్లాడుకుంటున్నారు.

'మన మేయరుగారు ఆ సమస్య పరిష్కారానికి ఓ ఇంజనీర్ని ప్రత్యేకంగా పిలిపించాడు.'

నేను ఉండబట్టలేక

'ఆ ఇంజనీరు ఎవరో నీకు తెలుసా?' అంటూ అడిగాను.

'తెలియదు'

'ఆ ఇంజనీరు గొప్ప శాస్త్రజ్ఞుడు కూడానట. ఆయన ఉపన్యాసాలిస్తున్నాడు. ఆ లెక్చర్లు చాలా బాగున్నాయట'. నేను, ఒకడన్నా నా మాటల్ని పట్టించుకుంటేనా!

సరే ఇంత చెప్పాను కద, ఇలాంటి సంఘటనలు మరిన్నైనా చెప్పగలను మీకు. బహుశా తప్పంతా నాదేలెండి. ఏమీ సాధించ కుండానే గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతున్నాను. కాని యిలా అనామకమైన జీవితం గడుపుతున్న వాణ్ణి నేనొక్కణ్నేనంటారా! నాలాంటి వాళ్లు మరెందరో! సాంస్కృతిక, శాస్త్రరంగాల్లో ఘనవిజయాలు సాధించిన మరెందరో, వాళ్లు మరణించిన రోజున ఈ పత్రికలు కనీసం 'సంతాపవార్త' కూడా ప్రచురించవు. చెప్పండి. ఎంతమంది గొప్ప శాస్త్రజ్ఞులు, సాంకేతిక నిపుణులు, చిత్రకారులు, శిల్పులు, రచయితలు, కవులు, గాయకులు, జనానికి వీళ్ల పేర్లు తెలుసా? ఒకరో, యిద్దరో వంచనాపరులు ఎలాగోలా పేరు తెచ్చుకుని బతికినన్నాళ్లూ తమ గురించి పత్రికల్లో రాయించుకుంటుంటారు. పైగా ఈ పత్రికలు 'కీర్తి' కన్నా అపకీర్తి వార్తలు ఎక్కువ ప్రముఖంగా ప్రచురిస్తాయి. అందువల్లే దొంగలూ, మోసగాళ్లూ, హంతకులూ మన పత్రికల్లో మొదటి పేజీల్లో దర్శనమిస్తుంటారు.

అంతలో, కంపార్ట్‌మెంట్ తలుపు తెరుచుకుంది. ఓ పొడుగాటి మనిషి లోపలికి తొంగిచూసి వెళ్లిపోయాడు.

'అతడెవరో తెలుసా, బ్యాంకు దోమ్మీకేసులో ప్రధాన నిందుతుడు'

'ఆహా, అప్పట్నించీ యిదేగామనం మాట్లాడుకుంటున్నది. దొంగల గురించి మనకు బాగానే తెలుసు. కాని కళాకారుల గురించి, పోనీ, సంగీత సామ్రాట్ చామ్‌కోవ్‌స్కీ గురించి లేదా ప్రసిద్ధ తాత్వికుడు... ఛ. వీళ్లకు ఆ పేర్లన్నా తెలియవు."

అప్పటిదాకా ఓపిగ్గా విన్న సజ్జనుడు,

"ఏమనుకోనంటే, మిమ్మల్నో మాటడుగుతాను. మీరు పుష్కోన్ పేరెప్పుడైనా విన్నారా?" అని అడిగాడు.

"పుష్కోవ్? లేదే. ఆ పేరెప్పుడూ విన్నట్టులేదు. ఎవరతడు?"

"నేనే పుష్కోవ్‌ని. గత ముప్పైఅయిదేళ్లుగా అనేక ప్రసిద్ధ రష్యన్ విశ్వవిద్యాలయాల్లో ప్రధానాచార్యుడిగా పనిచేశాను. అకాడమీ సభ్యత్వం కూడా వుంది. అనేక శాస్త్ర, తాత్విక గ్రంథాలు రచించాను."

ఏం చేయాలో తెలియక, యిద్దరూ ఒకర్నొకరు చూసుకుని పగలబడి నవ్వుకున్నారు. ■

## చెహోవ్ సూక్తులు

సాహిత్యం పరమావధి నిజాయితీతో నికార్సయిన సత్యాన్ని ఆవిష్కరించడం. 'జీవిత మధురిమ, జీవిత సౌందర్యం' లాంటివి చాలా చక్కటి మాటలే గాని రచయిత మిఠాయికొట్టువాడో, సౌందర్యపోషక వస్తువులు తయారుచేసేవాడో, విదూషకుడో కాదు.

* సాహిత్య వ్యవసాయాన్ని తన కర్తవ్యంగా తీసుకున్న వ్యక్తి ఎంత కష్టసాధ్యమనిపించినా దుక్కి దున్నటం ఆపకూడదు. కాళ్లూ, చేతులూ మట్టి కొట్టుకుపోతాయని అసహ్యించుకోకూడదు. జీవిత కర్కశత్వాన్ని భరించి, బురదా, ధూళీ ఒంటినిండా పట్టినా అతడు రాస్తాడు.

* విషాదానికీ, హాస్యానికీ మధ్య అడ్డుగోడ లేదు. నిజానికి ఒకే సంఘటనకుండే రెండువైపులవి. ఏ సంఘటనైనా ఏకకాలంలో విషాదపూరితంగానూ, హాస్యభరితంగానూ చూడవచ్చు.

* యవ్వనోధృతంలో భ్రమించినట్టుగా జీవితం అజరామరమైనదికాదా. నీ ఒంట్లో ఓపికా, ఆరోగ్యం యింకా మిగిలివున్నప్పుడే నలుగురికి మేలుచేసే మంచి పనులు చెయ్యి.

* ప్రతివ్యక్తిలోనూ ఏదో ఒక ప్రతిభ నిక్షిప్తమై వుంటుంది. అయితే, సుషుప్తావస్థలో వున్న ఈ ప్రతిభను తెలుసుకొని, జాగృతం చేసి, పెంపొందించుకోవటానికి ఎంతో బుద్ధికుశలత, ఏకాగ్రత, కార్యదీక్ష ధైర్యసాహసాలూ కావాలి. ఈ విలక్షణత వున్నవాడే సగటు మనిషి స్థాయినుండి 'విజేత' దాకా ఎదగగలడు...

కరుణారుణ